క్లుప్తంగా

పైపులను తొలగించండి



వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి గోవర్ధన గిరి నుంచి పెబ్బేరు పట్టణానికి వెళ్లే డబుల్‌బీటీ రోడ్డులో గోపల్‌దిన్నె క్రాస్ రోడ్డు సమీపంలోని కల్వర్టు వద్ద ప్రమాదకరంగా పైపులు నిల్వ చేయడంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. కల్వర్టులో నిర్మాణ పనులు చేపట్టేందుకు తెచ్చిన పైపులను రోడ్డుపై ఉంచడంతో రాత్రివేళలో వాహనదారులు ప్రమాదానికి గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు పనులను వెంటనే పూర్తి చేయించాలని కోరుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని ఫాగింగ్ యంత్రం



అమరచింత: పట్టణంలో దోమల బెడదను నివారించడానికి కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రం మరుగునపడింది. చిన్నపాటి మరమ్మతు సైతం చేపట్టలేకపోవడంతో ఫాగింగ్ యంత్రాన్ని మున్సిపల్ కార్యాలయంలోని మూలనపడేశారు. పట్టణంలోని పది వార్డుల్లో మురుగు కాల్వలు శుభ్రపర్చని కారణంగా దోమల సంఖ్య వివరీతంగా పెరిగిపోతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా వార్డుల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రూ.రెండు లక్షలతో కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రానికి వెంటనే మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే



అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో గల రైతువేదిక వద్ద ఉన్న బోరుమోటార్ ప్రమాదాలకు నెలవుగా మారింది. రైతు వేదిక నిర్మాణ సమయంలో తవ్వించిన బోరుబావి ప్రస్తుతం పైకప్పు లేకుండా ఉండటంతో చిన్న పిల్లలు ఆడుకుంటూ అందులో పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోరు తెరుచుకున్న బోరుబావికి మోటార్ బిగించాలని లేదా వాటిని మూసి ఉంచాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలకు చెందిన విద్యార్థులు సోమవారం విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణతను సాధించారు. ఈ సందర్భంగా అధిక మార్కులు సాధించిన విద్యార్థులు రాహుల్ కుమార్‌రెడ్డి, దీపికారెడ్డి, హన్సిత, సంతోష్, చందనలను మంగళవారం పాఠశాల డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామంజనేయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

తగ్గిన మామిడి ధర



పెద్దకొత్తపల్లి: ఒక్కసారిగా మామిడి ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడి కొనుగోలు కేంద్రాలలో వ్యాపారులు తక్కువ ధరలకే మామిడి కాయలను కొనుగోలు చేయడంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. కేజీ రూ.30 నుంచి రూ.40 లకు కొనుగోలు చేసే వ్యాపారులు ప్రస్తుతం కేజీ రూ.10 నుంచి రూ.20 కే కాయలను కొంటున్నారని రైతులు వాపోయారు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి తక్కువ ధరకే మామిడికాయలను కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

మందుల పంపిణీ

మానవపాడు: ముప్పై ఏళ్లు పైబడిన వారికి దీర్ఘకాలిక వ్యాధుల పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే వారికి మందులు పంపిణీ చేయాలని ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ చందన తెలిపారు. మంగళవారం కేంద్రంలోని ఆరోగ్యకేంద్ర పరిధిలోని గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ప్రతి ఒక్కరికీ మందులు పంపిణీ చేయాలని తెలిపారు.

మూగజీవాలకు తప్పని వెతలు



వీపనగండ్లలో నట్టల నివారణ మందులు వేస్తున్న పశువైద్య అధికారులు (ఫైల్)

- అరకొర పశువైద్య సిబ్బందితో అందని వైద్యం
- ఎండిన చెరువులు, కుంటలతో తాగునీటికి ఇబ్బందులు
- స్పందించని ప్రభుత్వం

వీపనగండ్ల: గ్రామాల్లో పశు సంపదను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో రైతులకు, కాపరులకు ఇబ్బందులు తప్పడం లేదు. పశువైద్యశాలలు, సబ్ సెంటర్ల ఏర్పాటులో నిర్లక్ష్యంతో పాటు సరిపడా వైద్య సిబ్బందిని, అవసరమైన భవనాలను నిర్మించకపోవడంతో మూగ జీవాలకు సరైన వైద్యం అందడం లేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు, కుంటలు ఎండిపోవడంతో తాగునీటికి జీవాలు అవస్థలు పడుతున్నాయి. యుద్ధప్రాతిపదికన గ్రామాల్లో పశువుల తొట్లను నిర్మించాలని అన్నదాతలు, గొర్రెల కాపరులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

1.07 లక్షల జీవాలు

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 1.07లక్షల మూగజీవాలు ఉన్నట్లు అధికారుల నివేదికలో తేలింది. వాటిలో 3,492 బర్రెలు, 79,500 గొర్రెలు, 5,224 మేకలు, 657 పందులు, 2,820 దున్నలు, 6,544 ఆవులు, ఎద్దులు, 1,420 కుక్కలు ఉన్నవి.

1.30 లక్షల వ్యాధి నిరోధక టీకాల పంపిణీ

పశువైద్యాధికారులు మండలంలో 5 నెలలుగా 14,630 పశువులకు చికిత్సలు చేశారు. 8,160 నట్టల నివారణ మందులు, 86 పశువులకు గర్భనిర్ధారణ, 73 దూడల జననం, 43 పశువులలో విత్తులను తొలగించడం, 6,288 ఎఫ్ఎండీ మందులు, బీటీ 21,164, పీపీఆర్ 85,640, ఎల్ఎస్‌డీ 3,581, సిప్‌పాక్స్ మందులు 5,400 లాంటి వ్యాధి నిరోధక మందులను పశువులు, గొర్రెలకు అందజేశారు.

వైద్యుల పోస్టుల ఖాళీలతో..

మండల కేంద్రంలోని ప్రధాన పశువైద్య కార్యాలయంలో డాక్టర్ పోస్టు ఖాళీతో పాటు కల్వరాలలో కూడా మరో వైద్యాధికారిని నియమించాల్సి ఉంది. దీంతోపాటు మండలంలో అటెండర్లు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తూంకుంట, సంగినేనిపల్లి, కల్వరాల గ్రామాల సబ్‌సెంటర్లు ఉన్నా సరైన వసతులు లేవు. ఉన్నతాధికారులు స్పందించి వేసవిలో మూగజీవాలకు అవసరమైన పశుగ్రాసం, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

నీటి తొట్టీలు నిర్మించాలి



తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో గ్రామాల్లోని మూగజీవాలకు తాగునీరు అందడం లేదు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి యుద్ధప్రాతిపదికన పశువుల తొట్లను నిర్మించి నీటి వసతిని కల్పించాలి.

– భగవంత్, రైతు, గోపల్‌దిన్నె

నిధులు కేటాయించాలి



మూగజీవాల వసతుల ఏర్పాటు కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి. మండల కేంద్రంలో పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శిథిలావస్థలో ఉన్న సబ్‌సెంటర్లకు నూతన భవనాలను నిర్మించాలి. తక్షణ చర్యలు తీసుకోకుంటే రైతులను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తాం.

– రాకేష్‌యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు, వీపనగండ్ల

నివేదికలు పంపించాం



వైద్యాధికారి పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం రాత పరీక్షలు నిర్వహించింది. ఫలితాలను వస్తే పోస్టులు కూడా భర్తీ అవుతాయి. రైతుల అవసరాల కోసం గడ్డి విత్తనాలను తెప్పిస్తాం. మండలంలో పశువైద్య సేవలకు అవసరమైన నిధుల కోసం ప్రత్యేక నివేదికలను పంపిస్తాం.

– శ్యాం, ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి, వీపనగండ్ల

పల్లె ప్రకృతివనం అగ్నికి ఆహుతి



కాలిపోయిన మొక్కలు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో పల్లెప్రకృతి వనంలో పెంచిన మొక్కలు అగ్నికి ఆహుతయి కాలిపోయిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం పల్లెప్రకృతి వనానికి సమీపంలో ఉన్న కాల్వలో గుర్తు తెలియని వ్యక్తులు జమ్ముకు నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు ఎగిసిపడి పల్లె ప్రకృతివనంలోని మొక్కలకు అంటుకున్నాయని తెలిపారు. దీంతో పండ్లు, పూల మొక్కలు కాలిపోగా గ్రామ పంచాయతీకి చెందిన బోర్ మోటార్, వైర్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నాగసానిపల్లిలో ప్రమాద బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



శాఖాపూర్‌లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన కడుకుంట్ల బాలరాజు, శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి చెందిన చింతకుంట రాములు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి మంగళవారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, వెంకటస్వామి, జెడ్పీటీసీ పద్మ, వెంకటేష్, గౌడ్‌నాయక్, వైస్ ఎంపీపీ కోట్ల బాలచంద్రారెడ్డి, విండో అధ్యక్షుడు జగన్నాథంనాయుడు, పరమేష్‌నాయి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి..

శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లికి చెందిన గొల్ల గోవిందమ్మ ఉపాధి కూలి పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి బాధిత మహిళను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆమెకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీరం రాజశేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నాగౌడ్, కురుమన్న, ఈశ్వరయ్య, రాజశేఖర్‌యాదవ్, చిన్నగోవిందు, పరశురాముడు, తిరుపతయ్య, లోకేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రానికి చెందిన వడ్ల గోవిందమ్మ, దాసరి భాస్కర్‌లు అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, పోతురాజు శంకరమ్మ ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వారితో పాటు పెద్ద లక్ష్మన్న, వెంకటన్న, రవి, బీచుపల్లి, జాకీర్, కృష్ణయ్య, రాజు ఉన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీధర్‌గౌడ్

ఆత్మకూర్: విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు, తమ గ్రామానికి పేరు తీసుకురావాలని మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్ అన్నారు. సీబీఎస్ఈ ఫలితాల్లో ఆత్మకూర్‌లోని ఎంవీరామన్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో వారిని మంగళవారం అభినందించారు. ఎంవీ రామన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయ పరంపర కొనసాగిస్తున్నారని, ఈఏడాది 10వ తరగతి ఫలితాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ ఆన్సి శ్రీధర్ తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్లోక, వాస్తల్య, దీపిక, ధనుష్‌చంద్ర, నిహారి, హరికృష్ణ, సయ్యద్‌రిహాన్, అభిగ్న, సాయిప్రణీత్‌రెడ్డి, దీపిక అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



గువ్వలదిన్నె శివారులో వృథా అవుతున్న మిషన్ భగీరథ నీరు

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె గ్రామ శివారులో మిషన్ భగీరథ పైపులైన్ రెండు రోజులుగా లీకేజీతో రోడ్డుపై వృథాగా పోతోంది. పంచాయతీ అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని,వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు తెలిపినా పట్టించుకోవడం లేదు. తాగునీరు వృథాగా పోతున్నా మరమ్మతు చేయించాలని గ్రామస్తులు విన్నవించినా పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని ప్రజలకు కోరుతున్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ అమానుషం

ఆత్మకూర్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆత్మకూర్ మండల అధ్యక్షుడు రియాజుద్దీన్, ప్రధానకార్యదర్శి ఆదం, ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, కోశాధికారి రాజు మండిపడ్డారు. నారాయణఖేడ్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం రెమ్యూనేషన్ చెల్లించాలని కోరడంతో ఆర్డీఓ పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం దారుణమన్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ప్రధాని మోదీ వైపే ప్రజలు

ఆత్మకూర్: ప్రధానమంత్రి మోదీతోనే దేశ రక్షణ, అభివృద్ధి సాధ్యమని నమ్మిన ఓటర్లు పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా నిలిచారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌జీ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు పెద్ద ఎత్తున మద్దతుగా నిలిచారని స్వచ్ఛందంగా ఓట్లు వేశారని తెలిపారు. సుమారు 50వేలకు పైగా మెజార్టీతో మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో డీకే అరుణ గెలుస్తున్నారని జోస్యం చెప్పారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ కూటమి అధికారం చేపడుతుందని, నరేంద్రమోదీ మూడోసారి ప్రదానిగా ప్రమాణస్వీకారం చేపట్టి రికార్డు సృష్టించబోతున్నారని తెలిపారు. డీకే అరుణ కేంద్రమంత్రి అయ్యే అవకాశం ఉందని, అదే జరిగితే ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి జోరుగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈసందర్భంగా ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్లకు ధన్యవాదాలు

కొత్తకోట రూరల్: ఈనెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా పనిచేసిన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అమడబాకుల సత్యారెడ్డి, రంగారెడ్డి, బసిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ హోదాల్లో ఉన్న మేధావులు, వివిధ రంగాల్లో పనిచేసిన కార్మికులు తమ వంతు కర్తవ్యంగా పనిచేసి గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారని పేర్కొన్నారు.

వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు

తాడూరు: వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. తద్వార భూసార అభివృద్ధికి తోడ్పడుతోంది. కలుపు మొక్కలు, చీడపీడలను నివారించవచ్చు. పంటకాలం ముగిసాక భూములను ఖాళీగా ఉంచడంతో పంటలను ఆశించే చీడపురుగులు తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. అవి భూమిలో పోషకాలు స్వీకరించడమే కాకుండ భూమిలోపలి పొరల నుంచి నీటిని లాగుతాయి. దీంతో భూమిలోని సారం దెబ్బతిని వానాకాలం పంటల సాగుపై ప్రభావం పడుతుంది. ప్రమాదాన్ని నివారించడానికి రైతులు యాసంగి పంటలు చేతికి అందగానే దుక్కులను దున్ని భూములను ఆరబెట్టాలని వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు చేస్తున్నారు. రైతులు ఈ పద్ధతి పాటించి వానాకాలంలో మంచి ఫలితాలు సాధించాలని కోరుతున్నారు.

లాభాలు ఎన్నో..

వేసవి కాలంలో రైతులు పంట కోత అనంతరం పొలాన్ని కాలిగా వదిలేస్తుంటారు. దీంతో తొలకరి వానలు పడగానే నీరు భూమిలోకి ఇంకిపోకుండా బయటకు వెళ్తోంది. వర్షాలకు ముందు భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండ ఉంటుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందకు కింద పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. భూమిలో తేమశాతం పెరిగి భూసారం అభివృద్ధి, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపుమొక్కల నివారణ వంటి ప్రయోజనాలు సమకూరుతాయి. వేసవి దుక్కులు దున్నేముందు పశువుల పెంటపోగు కంపోస్టు, ఎరువు మట్టిని వెదజల్లడం ద్వార సారవంతమైన పంట దిగుబడితో పాటు తేమశాతం మరింత పెరుగుతుంది. లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటకలతో సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరిస్తాయి.

భగీరథుడి అడుగుజాడలో నడవాలి



పెబ్బేరులో భగీరథుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తకోట: సగరులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించేందుకు అన్ని పార్టీలు తోడ్పాటునందించాలని సగర సంఘం నాయకులు కోరారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని పట్టణ శివారులో గల భగీరథ మహర్షి విగ్రహానికి స్థానిక సగర సంఘం సభ్యులు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు సగర సంఘం నాయకులు మాట్లాడుతూ సగరులు అన్ని రంగాల్లో వెనుకబాటు తనానికి గురయ్యారని, ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి రాజకీయాల్లో ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ పథకాల్లో ప్రత్యేక కోటా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పి.బుచ్చన్న, సురేష్, అంజన్న, కురుమూర్తి, వినోద్‌సాగర్, జనార్దన్, చీర్ల యాదయ్య సాగర్, విజయభాస్కర్ సాగర్, జేసీబీ రాము సాగర్, మాధవులు రాములుసాగర్, రమేష్‌సాగర్, రామాంజనేయులు, కరెంట్ రవిసాగర్, రాజబాబు, రవి, కృష్ణ, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

పాన్‌గల్: మండలంలోని కొత్తపేటలో సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సగర సంఘం జిల్లా నాయకుడు తిరుపతయ్యసాగర్ మాట్లాడుతూ భగీరథుడు గోర తపస్సు చేసి భగీరథ ప్రయత్నంతో గంగను భూమికి తీసుకొచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ భగీరథుని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, కిరణ్, తిరుతపయ్య, రాధాకృష్ణ, నాగరాజు, మాజీ సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో..



కొత్తపేటలో..

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలో మంగళవారం సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. సగర సంఘం నాయకులు భగీరథుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీజే సత్యం సాగర్, రాంమూర్తిసాగర్, రామకృష్ణసాగర్, కృష్ణమూర్తి, రాములు సాగర్, కురుమూర్తి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్



మదనాపురం వైపు నుంచి వనపర్తి వైపు వెళ్తున్న గడ్డి ట్రాక్టర్, లారీ

కొత్తకోట రూరల్: పట్టణంలో వాహనాల పార్కింగ్ విచ్చలవిడిగా మారింది. రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, తుఫాన్ వాహనాలు, ఆటోలు ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అక్రమ పార్కింగ్ నిరోధించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్టుగా మిన్నకుండిపోతున్నారు. దీంతో పట్టణంలో ఉన్న నాలుగు రోడ్లు పూర్తిగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. అంతే కాకుండా ప్రధాన రోడ్లకు వైన్ షాపులను ఏర్పాటు చేయడంతో మందు బాబులు తమ బైక్‌లను రోడ్డుకు పక్కనే నిలిపి వైన్ షాపుల్లోకి వెళ్లడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాలకులు మదనాపురం రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో ఆత్మకూర్ వైపు వెళ్లే వాహనదారుల ఇబ్బందులు వర్ణణాతీతం. రోడ్డు పక్కన వాహనాలు నిలపొద్దని గతంలో పోలీసులు అక్కడక్కడ బోర్డులు పెట్టినా అవి ప్రస్తుతం కనిపించకుండా పోయాయి. గతంలో పోలీసులు అప్పుడప్పుడు ట్రాఫిక్ నియంత్రించడానికి వాహనదారులకు హెచ్చరికలు జారీచేసి చర్యలు తీసుకునే వారు. ప్రస్తుతం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి ఇబ్బందులు కలుగుతున్నాయని పట్టణవాసులు పోలీసుల పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

చెరువులు వెలవెల

- నీరు లేక వట్టిపోయిన వైనం
- దాహం తీర్చుకునేందుకు మూగజీవాల పాట్లు
- కలగానే మిగిలిన గట్టు ఎత్తిపోతల నీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



నీరు లేక నెర్రలు బారిన గట్టు పెద్ద చెరువు

గట్టు: మండలంలో ప్రధాన నోటిఫైడ్ చెరువుల్లో చుక్క నీరు లేక వెలవెల బోతున్నాయి. మండుటెండలకు చెరువుల్లో గుక్కెడు నీరు లేక పోవడంతో దాహం తీర్చుకునేందుకు మూగజీవాలు తల్లడిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. గట్టు చెరువు పద కొండేళ్ల తర్వాత (2009 తర్వాత 2021లో) నిండింది. ఆ తర్వాత 2022లో చెరువులోకి సగం నీరు మాత్రమే వచ్చి చేరింది. 2023 వానకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురువక పోవడంతో చెరువులోకి నీరు చేరలేదు. చెరువుల్లో పుష్కలంగా నీరు ఉంటే చెరువుల చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలకు ఇబ్బంది ఉండదు. అయితే గతేడాది (2023) రబీలో బోరు నీటి ఆధారంగా పంటలను రైతులు సాగు చేసుకున్న భూగర్భ జలాల తగ్గుదల వల్ల చాలా మంది రైతులు పంటలు ఎండిపోయాయి. ప్రస్తుతం సల్కాపురం, గట్టు, మాచర్ల చెరువుల్లో చుక్క నీరు లేక చెరువులు వెల వెల బోతున్నాయి. సల్కాపురం చెరువు కింద 150 ఎకరాలు, గట్టు చెరువు కింద 300 ఎకరాలు, మాచర్ల చెరువు కింది 300 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ఈ చెరువులు సక్రమంగా నిండక పోవడంతో ఆయకట్టు మొత్తం బీడుగానే మిగిలిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు.

ఊరిస్తున్న గట్టు ఎత్తిపోతల..

కొన్ని సంవత్సరాలుగా గట్టు ఎత్తిపోతల పథకం గట్టు రైతులను ఊరిస్తూనే ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా గట్టు మండలంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే కాల్వ ద్వారా సాగునీరు అందుతోంది. మిగతా సగభాగం ఇప్పటి బోరు నీటితో పాటుగా వర్షాధారంగా పంటలను సాగు చేసుకుంటున్నారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని మల్లాపురం తండా, కేటీదొడ్డి గ్రామాల మధ్య గుట్టల మధ్యన 1.5 టీఎంసీల సామర్థ్యంతో గతేడాది నుంచి పనులను ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయి ఉపయోగంలోకి వస్తే, ఈ ప్రాంత రైతుల కష్టాలు శాశ్వతంగా దూరం కానున్నాయి.

చెరువులకు మహర్దశ..

మండలంలోని ప్రధాన చెరువులు నీరు లేక వెల వెల బోతున్నాయి. చెరువుల కింది ఆయకట్టు మొత్తం బీడుగా మారి ముండ్ల కంపలతో నిండిపోయింది. గట్టు ఎత్తిపోతల పథకం సాకారం అయితే గట్టు, సల్కాపురం, మాచర్ల, కుచినేర్ల గ్రామాల్లోని నోటిఫైడ్ చెరువులకు మహర్దశ పట్టనుంది. గట్టు పెద్ద చెరువు వర్షాధారంగానే నిండుతుంది. చెరువు నిండక పోవడంతో ఆయకట్టు బీడుగా మారింది. ఈ చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. సల్కాపురం, మాచర్ల చెన్న కేశస్వామి చెరువు, కుచినేర్ల కొత్త చెరువు, పాత చెరువుల పరిస్థితి అంతే. ఈ చెరువులు వర్షాలకు నిండాల్సిందే. గట్టు ఎత్తిపోతల పథకం పూర్తయితే ఈ చెరువులకు మహర్దశ పట్టనుంది. వాటితో పాటుగా చిన్న చిన్న కుంటలను కూడా నీటిని వదలడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి, సాగు కష్టాలు తీరనున్నాయి. కరువు గట్టు కాస్త మరో కోనసీమను తలపించడం ఖాయం.

చెరువులు నింపాలి

చెరువులు నిండక చాలా కాలమైంది. ఆయకట్టు మొత్తం బీడుగా మిగిలింది. వానలు బాగా పడితేనే చెరువులు నిండుతాయి. గట్టు ఎత్తిపోతల పథకాన్ని త్వరగా చేపట్టి, చెరువులకు నీటిని విడుదల చేయాలి. వర్షాలు పడక బోర్లు ఎండిపోయి, వ్యవసాయం భారంగా మారింది. కరువు నుంచి బయట పడాలంటే గట్టు ఎత్తిపోతల పథకం ఒక్కటే మార్గం.

– లబ్బన్న, రైతు, గట్టు

గట్టు లిఫ్టు పూర్తి చేయాలి

గట్టు ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేసి, చెరువులకు నీటిని వదలాలి. సల్కాపురం, గట్టు, మాచర్ల చెరువులు ఇప్పటికి వర్షాలపైనే ఆధారపడ్డాయి. వర్షాలు సంమృద్ధిగా కురిస్తేనే ఈ చెరువులు నిండుతాయి. ఒక ఏడాది చెరువు నిండితే మళ్లీ రెండు, మూడేళ్ల వరకు చెరువులు నిండవు. వర్షాలు సక్రమంగా కురువక పోవడంతో చెరువులు నిండడం లేదు.

– మహాదేవ్, రైతు, గట్టు